## నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

మర్చిపొమ్ము కొన్ని, మార్చుకొనుము కొన్ని
వద్దననుముకొన్ని, వదలు కొన్ని
మనసు శాంతినుండుడు మనిషి జీవితమున
విజయలక్ష్మి వాక్కు వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 160 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 7-9-2025 పేజీలు -8 | వెలః రూ. 5.00


# బై బై గణేశా


## గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు

## బాహుబలి క్రేన్ ద్వారా గంగమ్మ చెంతకు













- శనివారం మధ్యాహ్నం 1:30 గంటలలోపే హుస్సేన్ సాగర్ లో నిమజ్జనం
- భక్తులతో కిక్కిరిసిన క్రేన్ నెంబర్ 4 ప్రాంగణం
- ఖైరతాబాద్ బడా గణేష్ నిమజ్జనం పూర్తి

హైదరాబాద్ సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అత్యంత ప్రతిష్టాత్మకమైన ఖైరతాబాద్ గణనాథుడి నిమజ్జనం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్షలాది మంది భక్తుల సమక్షంలో మహా గణపతి ట్యాంక్‌బండ్‌లోని హుస్సేన్ సాగర్ నదిలోకి చేరారు. "గణపతి బప్పా మోరియా" నినాదాలతో హైదరాబాద్ నగరం మొత్తం మారుమోగిపోయింది. గణేశ్ నిమజ్జనానికి చాలా రోజుల ముందుగానే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. నిమజ్జనం రోజు ఉదయం 7.30 గంటలకు బడా గణేశ్ శోభాయాత్ర ప్రారంభమైంది. విజయవాడ నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన ఒక భారీ వాహనంలో 70 టన్నుల గణనాథుడిని ఊరేగింపుగా ట్యాంక్‌బండ్‌కు తరలించారు. -మిగతా 2 లో



## నరేంద్రమోదీ గొప్ప ప్రధానమంత్రే..

- ప్రస్తుతం ఆయన చేస్తున్నది నాకు నచ్చడం లేదు
- ప్రధాని మోదీతో నేను ఎప్పుడూ స్నేహంగానే ఉంటా.
- భారత్-అమెరికా దేశాల మధ్య ప్రత్యేకమైన బంధం ఉంది
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,
భారత్ పై అమెరికా భారీ సుంకాలు విధించడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు ఇటీవల బలహీనపడ్డాయి. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ని పొగిడినట్టే పొగిడి, అతడి తీరు నచ్చలేదని వ్యాఖ్యానించారు.ట్రంప్ శుక్రవారం వైట్‌హౌస్‌లో సీఈవోలకు ఇచ్చిన విందు సందర్భంగా మాట్లాడుతూ.. భారత్, రష్యాలకు దూరమయ్యాం అంటూ తన ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. ఆ రెండు దేశాలు చైనా చీకటి వలయంలో చిక్కుకున్నాయని పేర్కొన్నారు. దీనిపై శనివారం మీడియా ప్రశ్నించగా ఆయన స్పందించారు. రష్యా నుంచి భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తోందని, అది తనను చాలా నిరాశకు గురిచేసిందని చెప్పారు. రష్యా చమురు కొనుగోలు చేయవద్దని భారత్‌కు తాను చెప్పానని, అయినా వెనక్కి తగ్గకపోవడంతో భారత దిగుమతులపై పెద్ద మొత్తంలో టారిఫ్‌లు విధించానని ట్రంప్ తెలిపారు. అయితే తాను -మిగతా 2 లో

## నిమజ్జనోత్సవాల్లో సీఎం రేవంత్

### సాధారణ వ్యక్తిగా ట్యాంక్ బండ్ పైకి

- ఆకస్మికంగా వచ్చి పరిశీలించిన రేవంత్
- భక్తులకు అభివాదం చేస్తూనే సూచనలు



హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్సేన్ సాగర్ వద్ద నిమజ్జనాలను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పరిశీలించారు. భక్తులు, సందర్శకులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి వేదికపై నుంచి భక్తులకు అభివాదం చేశారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులతో కలిసి నినాదాలు చేశారు. క్రేన్ నెం. 4వద్ద నిమజ్జనాలను పరిశీలించారు. నిమజ్జనం ఏర్పాట్లను కలెక్టర్ హరిచందన సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా విధుల్లో పాల్గొన్న అన్ని విభాగాల సిబ్బందిని సీఎం అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. ముందస్తు సమాచారం -మిగతా 2 లో

## ఫామ్‌హౌస్‌లో కీలక భేటీ

- ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్ సుదీర్ఘ చర్చలు
- కేటీఆర్, హరీష్ రావులతో మంతనాలు



గజ్వేల్,
భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా భేటీ-అయ్యారు. ఇప్పటికే కేటీఆర్ సహా పలువురు పార్టీ ప్రముఖులు అక్కడ ఉన్నారు. ఇటీవల అసెంబ్లీలో చోటు-చేసుకున్న పరిణామాలు, కాళేశ్వరంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, ఎమ్మెల్సీ పదవికి, భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కవిత రాజీనామా చేయడం తదితర అంశాలపై వీరు చర్చించినట్లు-తెలుస్తోంది. ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో సుదీర్ఘంగా చర్చలు కొనసాగాయి. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై -మిగతా 2 లో

## రాష్ట్రల ఆర్థిక మంత్రులతో చర్చించాకే శ్లాబులు

- జీఎస్టీ శ్లాబులపై నిర్మలా సీతారామన్ వివరణ
- ధరలు దిగివచ్చి..సామాన్యులకు మేలుచేస్తుందని వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిఎస్‌టి శ్లాబులు 5, 12,18, 28 శాతంగా ఉండేవి. అయితే ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టుగా ఈ శ్లాబుల విధానం బిజెపి నిర్ణయం కాదని, రాష్ట్ర ఆర్థిక మంత్రుల సాధికార కమిటీ-తీసుకున్నదని శనివారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. నాలుగు శ్లాబుల విధానంపై ప్రతిపక్ష పార్టీలు దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆమె శనివారం అన్నారు. నాలుగు శ్లాబుల విధానం కాస్తా.. తాజాగా జరిగిన -మిగతా 2 లో



## ట్రంప్‌కు మోడీ మరో షాక్?

- ఐక్యరాజ్యసమితి సమావేశాలకు దూరం

న్యూఢిల్లీ
అమెరికా అధిక టారిఫ్‌ల వేళ భారత్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులో అమెరికాలో జరగనున్న ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరు కావాల్సి ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఈ సమావేశాలకు మోదీ హాజరు కావడం లేదని తెలిసింది. ఆయనకు బదులు విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ సమావేశాల్లో ప్రసంగించనున్నట్లు తాజా సమాచారం. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. హై లెవల్ డిబేట్ మాత్రం సెప్టెంబర్ 23 నుంచి 29 వరకు జరగనున్నది. చర్చలో పాల్గొనే వక్తల జాబితాను తాజాగా యూఎన్ గత నెల రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తొలుత బ్రెజిల్ చర్చను ప్రారంభిస్తుంది. ఆ తర్వాత అమెరికా మాట్లాడుతుంది. సెప్టెంబర్ 23వ తేదీన యూఎన్జీఏ పోడియం నుంచి డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నేతలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. -మిగతా 2 లో

## కమిషన్లు రావనే పేదలకు ఇళ్లు కట్టలేదు

### రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసారు

- కాళేశ్వరంతో కమిషన్లు లాగారు
- మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు



వనపర్తి, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కల్వకుంట్ల కుటుంబం పదేళ్లలో భారీగా అవినీతికి పాల్పడిందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పేదలకు ఇళ్లు కడితే కమిషన్లు రావని కాళేశ్రం కట్టారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో 8 లక్షల 19 వేల కోట్ల రూపాయల అప్పుల భారం ప్రజలపై మోపిందని ఆక్షేపించారు. శనివారం వనపర్తి జిల్లాలోని పెద్దమందడి మండలం మంగంపల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు గృహప్రవేశం చేశారు. -మిగతా 2 లో

## 35 లక్షలకు బాలాపూర్ గణేశ లడ్డూ

ఏళ్లకలుగా లడ్డూ కోసం యత్నిస్తున్న దశరథ గౌడ్



2 లో

## విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి

- సిరిసిల్ల జేఎన్టీయూలో శాశ్వత భవనాలు నిర్మించాలి
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, వీసీతో ఫోన్‌లో సంప్రదించిన కేటీఆర్

2 లో



## కవిత ఓ కొరివి దయ్యం

- బీఆర్ఎస్ హయాంలో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారు
- కవిత కొంత దాచిపెట్టి.. కొంత మూసిపెట్టి మాట్లాడుతున్నారు
- మంత్రి జూపల్లి విమర్శలు



జోగులాంబ గద్వాల
మాజీ సీఎం కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని అన్న కవిత కూడా ఓ కొరివి దయ్యం అంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని కవితనే చెప్పారని తెలిపారు. తాను ఆనాడు మంత్రి పదవి కోసం బీఆర్ఎస్ పార్టీలోకి రాలేదని పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పాతర వేసిందని విమర్శించారు. కవిత కొంత దాచిపెట్టి.. కొంత మూసిపెట్టి మాట్లాడుతున్నారని జూపల్లి ఆరోపించారు. జిల్లా కేంద్రంలో 2-ఇబిఓ ఇళ్ల గృహ ప్రవేశం కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అధ్యక్షతన బహిరంగ -మిగతా 2 లో

## నరేంద్రమోదీ గొప్ప ప్రధానమంత్రే..

(మొదటి తరువాయి)

భారత్‌పై విధించిన 50 శాతం సుంకాలు చాలా ఎక్కువేనని ఆయన అంగీకరించారు. ప్రధాని నరేంద్రమోదీతో తనకున్న వ్యక్తిగత సంబంధాల గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. 'భారత్‌తో సంబంధాల పునరుద్ధరణకు సిద్ధంగా ఉన్నారా..?' అని మీడియా ప్రశ్నించగా.. 'కచ్చితంగా' అని ట్రంప్ బదులిచ్చారు. 'నేను ఎప్పుడూ అదే కోరుకుంటా. ప్రధాని మోదీతో నేను ఎప్పుడూ స్నేహంగానే ఉంటా. ఆయన గొప్ప ప్రధాని. కానీ.. ప్రస్తుతం ఆయన చేస్తున్నది నాకు నచ్చడం లేదు. భారత్-అమెరికా దేశాల మధ్య ప్రత్యేకమైన బంధం ఉంది. దీనిపై ఆందోళన అవసరం లేదు' అని చెప్పారు. ఇటీవల మోదీ అమెరికాలో పర్యటించిన విషయాన్ని కూడా ట్రంప్ గుర్తుచేశారు. శుక్రవారం ఆయన ట్రూత్ సోషల్‌లో.. 'భారత్, రష్యాలను అమెరికా కోల్పోయింది. అవి రెండూ చైనా చీకటి వలయంలో చిక్కుకున్నాయి' అని పేర్కొన్నారు. ఆ పోస్టుతోపాటు ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు కలిసి ఉన్న ఫొటోను కూడా ట్రంప్ పంచుకున్నారు. ఆ మూడు దేశాలు సుదీర్ఘ, సుసంపన్న భవితవ్యం కలిగి ఉండాలని కోరుకుంటున్నట్లు వ్యంగ్య కామెంట్స్ చేశారు.

## నిమజ్జనోత్సవాల్లో సీఎం రేవంత్

లేకుండా సాదాసీదాగా సీఎం రేవంత్‌రెడ్డి హుస్సేన్ సాగర్ వద్ద ప్రత్యక్ష కావడంతో భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా హుస్సేన్ సాగర్ వద్దకు సీఎం వచ్చి ఏర్పాట్లను పరిశీలించడం పట్ల భాగ్యనగర్ ఉత్సవ్ సమితి ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. నగర వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్ వద్ద జరుగుతున్న గణేష్ నిమజ్జనాల వేడుకను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్వయంగా ట్యాంక్‌బండ్‌కు సీఎం వచ్చినట్లు- సమాచారం. నిమజ్జనాల నేపథ్యంలో అధికారులు చేసిన భద్రత ఏర్పాట్లను సీఎం పరిశీలించారు. అనంతరం ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సాధారణ వ్యక్తిగా ట్యాంక్ బండ్ వద్దకు వచ్చి నిమజ్జనం ఏర్పాట్లు- పరిశీలించారు. రేవంత్ రెడ్డి రావడంతో భారీగా ప్రజలు తరలివచ్చారు. ప్రజలకు అభివాదం చేస్తూ.. ముందుకు కదిలారు. అత్యంత తక్కువ సంఖ్యలో భద్రత సిబ్బందితో.. మూడు కార్ల ఎస్కార్ట్‌తో సీఎం ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. నిమజ్జనం జరుగుతున్న తీరును అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. వినాయక నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించాలని సీఎం స్పష్టం చేశారు.

## ఫామ్‌హౌస్‌లో కీలక భేటీ

చర్చిస్తున్నట్లు- తెలుస్తోంది. హరీష్ రావుపై మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై ఆసక్తికర చర్చ జరుగుతున్నట్లు- సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి ప్రభుత్వం అప్పగించిన విషయంపై ఆదివారం కూడా సమావేశాలు కొనసాగే అవకాశం ఉంది. కొద్దిసేపటి క్రితమే.. ఫామ్ హౌస్ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లినట్లు- సమాచారం. అయితే.. ఫామ్ హౌస్‌లోనే హరీష్ రావు, కేటీఆర్ ఉండనున్నట్లు- తెలుస్తోంది. ఈ మేరకు రేపటి సమావేశాల తరువాత మీడియా సమావేశం లేదా ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. అయితే మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై తాజాగా మాజీ మంత్రి హరీష్ రావు స్పందించిన విషయం తెలిసిందే. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తన నిబద్ధత అందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. ప్రజల ఆకాంక్షల మేరకే పనిచేయాల్సిన బాధ్యత తనపై ఉందని నొక్కిచెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో ఓ కార్యకర్తలాగా తాను పాతికేళ్లు పనిచేశానని వ్యాఖ్యానించారు. తనపై, పార్టీపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై చేసిన ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. తనపై దిగజారుడు రాజకీయాలు మంచిది కాదని హరీష్‌రావు హితవు పలికారు. ఈ నేపథ్యంలో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో నిర్వహిస్తున్న సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే సమావేశాల అనంతరం బీఆర్ఎస్ ఎలాంటి ప్రకటన చేస్తోంది అనే దానిపై సర్వాత్ర ఉత్కంఠ నెలకొంది.

## ట్రంప్‌కు మోడీ మరో షాక్?

సెప్టెంబర్ 26వ తేదీన ప్రధాని మోదీ ప్రసంగం ఉంటుందని ఆ జాబితాలో ఉంది. అదే రోజున ఇజ్రాయిల్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నేతలు కూడా ప్రసంగిస్తారు. ఈ సమావేశాలకు ప్రధాని యూఎస్ వెళ్తారని అంతా భావించారు. ఈ పర్యటన సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య సమస్యల పరిష్కారానికి ట్రంప్-మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే, అనూహ్యంగా ఈ సమావేశాలకు మోదీ దూరంగా ఉన్నట్లు- తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

### విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి


- సిరిసిల్ల జేఎన్టీయూలో శాశ్వత భవనాలు నిర్మించాలి
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, వీసీతో ఫోన్‌లో సంప్రదించిన కేటీఆర్



**హైదరాబాద్ సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జేఎన్టీయూ సిరిసిల్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, జేఎన్టీయూ వీసీ టి కిషన్‌కుమార్‌రెడ్డితో ఆయన ఫోన్‌లో సంప్రదించారు. జేఎన్టీయూ సిరిసిల్లలో ఇంజినీరింగ్ కాలేజీ కోసం శాశ్వత భవనాల నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తరగతులకు ఆటంకం కలగకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. సిరిసిల్లలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తమ హయాంలో ప్రారంభించిన జేఎన్టీయూ సిరిసిల్ల ఇంజినీరింగ్ కాలేజీకి అవసరమైన శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేములవాడలోని డిగ్రీ కాలేజీలో కొనసాగుతున్న ప్రస్తుత తాత్కాలిక తరగతి గదులకు తాళం వేయడంతో ఇంజినీరింగ్ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన వార్తను ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. ప్రస్తుతం నడుస్తున్న తీరుగానే స్థానిక అగ్రహారంలోని డిగ్రీ కాలేజీ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే కాలేజీతో అవసరమైన ఒప్పందం చేసుకుని పెండింగ్‌లో ఉన్న అద్దె బకాయిలను చెల్లించేలా చూడాలని కోరారు. ఈ అంశంలో సానుకూలంగా స్పందించిన సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ వెంటనే పెండింగ్ బకాయిలను చెల్లించడంతోపాటు తరగతులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారని వివరించారు.

# బై బై గణేశా..

(మొదటి తరువాయి)



ఈ శోభాయాత్రలో పాలుపంచుకోవడానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దారి పొడవునా భక్తులు పసుపు, కుంకుమలతో గణపతికి నీరాజనం పలికి, తమ భక్తిని చాటుకున్నారు. ఎక్కడ చూసినా పూలతో అలంకరించిన వాహనాలు, డప్పుల చప్పుడు, నృత్యాలతో నగర వీధులు పండుగ వాతావరణాన్ని తలపించాయి. మధ్యాహ్నం 12 గంటలకు భారీ శోభాయాత్ర ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ మళ్లింపులతో పాటు, భారీ క్రేన్ల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగింది. గణనాథుడి ఊరేగింపు ట్యాంక్‌బండ్‌కు చేరుకోగానే అక్కడ పూజల కోసం వేచి ఉన్న భక్తులు "జై గణేశా.. జై జై గణేశా" అంటూ నినాదాలు చేశారు.

**ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనం**

ఎన్టీఆర్ మార్గ్‌లోని నాలుగవ క్రేన్ వద్దకు చేరుకున్న లంబోధరుడికి ఖైరతాబాద్ ఉత్సవ సమితి సభ్యులు, ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భాగంగా గణనాథుడికి చివరిసారిగా హారతి ఇచ్చి, పుష్పాలతో అలంకరించారు. అనంతరం భారీ క్రేన్ సహాయంతో సుమారు 70 టన్నుల బరువున్న గణపతిని నిదానంగా హుస్సేన్ సాగర్ నదిలోకి నిమజ్జనం చేశారు. మహా గణపతి నీటిలో మునిగిపోతుండగా భక్తుల జై గణేశా నినాదాలు మిన్నంటాయి. ఈ శోభాయాత్రలో పాల్గొనడానికి రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచే కాకుండా, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఒక నెల పాటు ఉత్సవాలు జరుపుకున్న ఖైరతాబాద్ గణనాథుడి దర్శనం కోసం ప్రతి ఏటా లక్షల మంది భక్తులు తరలివస్తారు. ఈ సంవత్సరం కూడా భారీగా భక్తులు తరలివచ్చి చివరిసారిగా తమ అభిమాన దైవాన్ని చూసి ఆశీర్వాదం పొందారు. పోలీసు యంత్రాంగం నిమజ్జనాన్ని విజయవంతం చేయడానికి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంది. క్రేన్ల వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూశారు. అటు ఖైరతాబాద్‌లో, ఇటు ట్యాంక్‌బండ్‌లో నిమజ్జన ప్రక్రియను పూర్తి చేయడానికి వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేశాయి. ఈ విజయవంతమైన నిమజ్జనంతో 11 రోజుల గణేశ్ ఉత్సవాలు ముగిశాయి.

# రాష్ట్రల ఆర్థికమంత్రులతో చర్చించాకే శ్లాబులు

జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో 5, 18 శాతం శ్లాబులకి తగ్గిస్తూ.. గతంలో ఉన్న 12, 28 శాతం శ్లాబులను తొలగిస్తూ ఈ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ శ్లాబులు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానుంది. తాజాగా ఈ విషయంపై నిర్మలా సీతారామన్ పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'సామాన్యులపై దృష్టిసారించి సంస్కరణలు చేపట్టాము. సామాన్యుడు వినియోగించే వస్తువులపై విధించే పన్నుపై సమీక్షించాము. ఈ సంస్కరణల వల్ల రేట్లు- బాగా తగ్గనున్నాయి' అని ఆమె అన్నారు. ఇకపోతే జీఎస్టీ లో సంస్కరణలకు మద్దతు తెలిపినందుకు అన్ని రాష్ట్రాలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు లేఖ రాసినట్లు- చెప్పారు. పన్ను రేట్లను సవరించాలనే దానిపై రాష్ట్రాలు అభిప్రాయాలు చెప్పినప్పటికీ.. అవన్నీ సామాన్యుడికి ప్రయోజనం కలిగించేవేనని అన్నారు. జీఎస్టీ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రజలకు ఎంతో దోహదపడతాయన్నారు. జీఎస్టీ రేట్లలో మార్పునకు మద్దతు తెలియ జేసినందుకు ప్రతి ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు తెలియజేశా. ఎన్ని తీవ్రమైన చర్చలు, వాదనలైనా చేయవచ్చు. చివరకు జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలతో దేశ ప్రజలకు ఉపశమనం కలిగింది. ఇందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ లేఖ రాశానని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. సామాన్యులకు ప్రయోజనం చేకూర్చే సవరణలే ఉన్నాయని, వీటికి వ్యతిరేకంగా మాట్లాడే అవకాశమే లేదన్నారు. దేశ ప్రయోజనాల కోసం అందరూ ఒక్కతాటిపైకి రావడం సంతోషకర విషయమన్నారు.రేట్ల తగ్గింపుపై రాష్ట్రాలు ఎప్పుడూ అనుకూలంగానే ఉంటాయని, అయితే, వారి ఆందోళనంతా రాబడిలో కోతపైనే ఉంటుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. తాజా తగ్గింపుతో రాష్ట్రాలకే కాకుండా కేంద్రం కూడా ఆదాయం కోల్పోతుందన్న విషయం వారికి చెప్పాను. రేట్లు- తగ్గితే ప్రజలు కొనుగోలు చేస్తారు. తద్వారా కోల్పోయిన ఆదాయాన్ని ప్రభుత్వాలు భర్తీ చేసుకోవచ్చు. ఈ విషయంతోనే ఏకాభిప్రాయం కుదిరిందని కేంద్ర మంత్రి వివరించారు. ఇదిలాఉంటే, ఇటీవల తీసుకున్న జీఎస్‌టీ- కొత్త రేట్లు- సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్న విషయం తెలిసిందే.

# కమిషన్లు రావనే పేదలకు ఇళ్లు కట్టలేదు

(మొదటి తరువాయి)

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు తమ ప్రభుత్వం నెల నెల వడ్డీలు కడుతూనే.. అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెడ్లలా ముందుకు తీసుకుపోతున్నామని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పేదవారిని ఓటు- బ్యాంకుగా మాత్రమే చూశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 7 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని.. పాత రేషన్ కార్డుల్లో 17 లక్షల మంది పేర్లను చేర్చామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంవత్సరానికి రెండువేల డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చి ఉంటే అందరికీ ఇళ్లు వచ్చేవని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇళ్లు కడితే కమిషన్లు రావని తెలిసి మాజీ సీఎం కేసీఆర్ ఇళ్లను కట్టలేదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కడితే కమిషన్లు వస్తాయని తెలిసి ఆ ప్రాజెక్టును చేపట్టారని విమర్శించారు. కాళేశ్వరంలో కేసీఆర్ ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాబోయే మూడు విడతల్లో ప్రతి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిచ్చి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

# కవిత ఓ కొరివి దయ్యం

(మొదటి తరువాయి)

సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో.. మీడియాతో మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు మాజీ ఎమ్మెల్సీ కవితపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

# రోప్ వే తెగి ఆరుగురి మృతి

### గుజరాత్‌లోని పావగఢ్ కొండపై విషాదం



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గుజరాత్‌లోని పంచమహల్ జిల్లా, పావగఢ్ కొండపై శనివారం కార్గో రోప్‌వే కేబుల్ తీగ తెగిపోవడంతో ఆరుగురు మరణించారు. ఈ కొండపై మహాకాళిక దేవాలయం ఉంది. పోలీసు సూపరింటెండెంట్ హరేష్ దుధట్ మాట్లాడుతూ, ఈ సంఘటనలో ఆరుగురు మరణించారని, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. పంచమహల్ కలెక్టర్ అజయ్ దహియా మాట్లాడుతూ మృతుల్లో ఇద్దరు లిఫ్ట్ ఆపరేటర్లు, ఇద్దరు కూలీలు ఉన్నారన్నారు. ప్రధాన రోప్ వేని రెండు రోజుల నుంచి మూసేసినట్లు తెలిపారు.

# 35లక్షలకు బాలాపూర్ గణేశ లడ్డూ

### ఏళకలుగా లడ్డూ కోసం యత్నిస్తున్న దశరథ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలుగు రాల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన బాలాపూర్ లడ్డూ వేలం పాట ఘనంగా సాగింది. ఈ సారి లడ్డూ వేలంలో భారీ ధర పలికింది. దీన్ని కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ అనే వ్యక్తి రూ.35 లక్షలకు దక్కించుకున్నారు. వేలంలో 38 మంది భక్తులు పాల్గొన్నారు. గతేడాది ఈ లడ్డూను రూ.30.01 లక్షలకు కొలను శంకర్‌రెడ్డి దక్కించుకున్నారు. గతేడాదికంటే ఈసారి లడ్డూ ధర రూ.4.99 లక్షలు అధికంగా పలికింది. లడ్డూ విజేత దశరథగౌడ్‌ను ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ- సన్మానించింది. 'బాలాపూర్ లడ్డూ అంటే నాకు చాలా ఇష్టం. ఆరేళ్లుగా దీని కోసం ప్రయత్నిస్తున్నా. ఇన్నేళ్ల తర్వాత బాలాపూర్ లడ్డూ దక్కింది. ఎంతో సంతోషంగా ఉందని దశరథగౌడ్ పేర్కొన్నారు. బాలాపూర్ గణేశుడి లడ్డూ కోసం ఆరేళ్లుగా ప్రయత్నిస్తున్నాని లడ్డూ విజేత లింగాల దశరథ గౌడ్ పేర్కొన్నారు. ఇన్నేళ్ల తర్వాత బాలాపూర్ గణేశుడి లడ్డూ దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. బాలాపూర్ గణేశ్ అంటే తనకు చాలా ఇష్టమని, గత కొన్నేండ్ల నుంచి ఇక్కడికి వస్తున్నట్లు- పేర్కొన్నారు. ఇవాళ ఆ భగవంతుడు నాకు లడ్డూను దక్కించాడు.. చాలా సంతోషంగా ఉందని లింగాల దశరథ గౌడ్ పేర్కొన్నారు. లడ్డూ విజేత దశరథ గౌడ్‌ను ఉత్సవ కమిటీ- సన్మానించింది. రూ. 35 లక్షల నగదును ఉత్సవ కమిటీకి దశరథ గౌడ్ అందించారు. రాష్ట్రంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న బాలాపూర్ గణేశుడి లడ్డూ మరోసారి భారీ ధర పలికింది. గత రికార్డులను బ్రేక్‌చేస్తూ వేలం పాటలో రూ.35 లక్షలకు కర్మాన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇది గతేడాదికంటే రూ. 4.99 లక్షలు అధికం. 2024లో బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితికి చెందిన కొలను శంకర్ రెడ్డి రూ.30.01 లక్షలకు దక్కించుకున్నారు. బాలాపూర్ గణేశుడి ఊరేగింపు తర్వాత గ్రామంలోని బొడ్రాయి వద్ద వేలం పాట నిర్వహించారు. ఇందులో మొత్తం 38 మంది పాల్గొన్నారు. వారిలో ఏడుగురు స్థానికేతరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. లడ్డూవేలం తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

## 2025 సెప్టెంబర్ 7, ఆదివారం తెలుగు పంచాంగం




మాసం -పక్షం
భాద్రపద మాసం, శుక్లపక్షం
తిథి: పౌర్ణమి 1:41 AM - 11:38 PM తదుపరి కృష్ణపక్ష ప్రకారణం
నక్షత్రం
శతభిషం -రాత్రి 10:55 PM
6సెప్టెంబర్) - 9:41 PM (7 సెప్టెంబర్)
పూర్వ భాద్రపదం - రాత్రి 9:41 PM (7 సెప్టెంబర్)
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: 4:38 - 5:26 AM
అభిజిత్: 12:00 - 12:49 PM
అమృతకాలం: 2:50 - 4:21 PM
అశుభ సమయాలు
రాహుకాలం: 5:02 - 6:34 PM
యమగండం: 12:24 - 1:57 PM
గులికా: 3:29 - 5:02 PM
దుర్ముహూర్తం: 4:56 - 5:45 PM
వర్జ్యం: 5:45 - 7:16 AM, రాత్రి 3:39 - 5:08 AM

# ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



**తిప్పర్తి ,సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తిప్పర్తి మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని ఘనంగా శాలువాలు, పూల బొకేలు, షీల్డ్ లతో సన్మానించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించిన మాట్లాడిన మండల విద్యాధికారి సర్వేపల్లి రాధాకృష్ణ గొప్పతనా న్ని మరోసారి వివరించారు ఉపాధ్యాయ స్థాయి నుండి ఎంతో ఉన్నతమైన స్థాయికి ఎదిగిన ఒక గొప్ప మహానీయుడని కొనియాడారు ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని ప్రతినిత్యం విద్యార్థుల శ్రేయస్సు కోసం ఆలోచించే ఒక గొప్ప వ్యక్తిత్వం కలగన అలాంటి ఉపాధ్యాయులకు సన్మానించడం గర్వంగా ఉందని సన్మానం పొందిన ఉపాధ్యాయుల బాధ్యతలు మరింత ఎక్కువ అవుతాయని ప్రతినిత్యం కొత్త పద్ధతుల్లో విద్యార్థులను ఉత్తేజపరుస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచే విధంగా కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సుధాకర్,విద్యాధికారి నరసింహ నాయక్, మండల రెవెన్యూ అధికారి రామకృష్ణ, మామిడాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, రాజుపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుశీల, యోగేందర్, సుశీల, యాదగిరి, ప్రధానోపాధ్యాయులు యోగేందర్,అరుణ శ్రీ ఉపాధ్యాయునీ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎర్రమాద అనురాధ



**తిప్పర్తి ,సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
తిప్పర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న ఎర్రమాద అనురాధ శనివారం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉందని గత 15 ఏళ్లుగా ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తూ ఎంతోమంది విద్యార్థులని జిల్లా, రాష్ట్రస్థాయికి క్రీడలలో ఉత్తమ క్రీడాకారులగా తీర్చిదిద్దిన తనకు స్థానిక విద్యాధికారి నరసింహ నాయక్ చేతుల మీదుగా సన్మానం పొందడం చాలా సంతోషంగా ఉందని భవిష్యత్తులో ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణిస్తూ రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించే విధంగా కృషి చేస్తానని తెలిపారు మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ అపర్ణ మాట్లాడుతూ తమ స్కూల్ ఉపాధ్యాయురాలు మండల స్థాయి అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నాం

# గిన్నిస్ రికార్డులో ఆల్ఫోర్స్ విద్యార్థినికి స్థానం

-కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచి గజబింకార్ శ్రీ నిత్యకు అరుదైన గౌరవం



**కరీంనగర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థిని గజబింకార్ శ్రీ నిత్య గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి పాఠశాల ఔనత్యాన్ని పెంపొందించింది. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో సుమారు 4500 మంది కళాకారులతో కలిసి పాల్గొని విశిష్ట ప్రతిభ కనబరిచిన శ్రీ నిత్యకు ఈ గౌరవం లభించింది. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన సభకు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, "విద్యతో పాటు కళల పట్ల ఆసక్తి పెంపొందించాలి. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. కళలు ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయి" అని పేర్కొన్నారు.విద్యార్థిని శ్రీ నిత్యకు పుష్పగుచ్ఛం, జ్ఞాపికలు అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎలిగేడులో యూరియా కొరతపై రైతుల ఆందోళన

-540 బస్తాల పంపిణీ, పరిస్థితిని సమీక్షించిన అధికారులు



**ఎలిగేడు, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) వద్ద యూరియా కొరతపై రైతులు శనివారం పెద్ద సంఖ్యలో చేరి ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం నుంచే చెప్పులను క్యూలైన్‌గా పెట్టి నిలబడిన రైతులు, గోదాం షటర్ ఓపెన్ చేయగానే ఒక్కసారిగా అక్కడికి చేరడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వరి పంట పొట్ట దశకు చేరిందని, యూరియా లేక పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, పోలీసు సిబ్బంది అక్కడికి చేరి పరిస్థితిని చక్కబెట్టారు.నాలుగు రోజుల క్రితం ఇచ్చిన టోకెన్లకు అనుగుణంగా పంపిణీ కొనసాగిందని అధికారులు తెలిపారు.ఎలిగేడు పిఎసిఎస్‌లో 540 బస్తాలు, దూళికట్ట పిఎసిఎస్‌లో 340 బస్తాలు రైతులకు అందజేయడం జరిగిందని వ్యవసాయ శాఖ వెల్లడించింది.

# గ్రామ పాలన అధికారులు పనిపై పూర్తి శ్రద్ధ వహించి విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ :ఇలా త్రిపాఠి.



**నల్లగొండ ,సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
శనివారం ఉదయాదిత్య భవన్లో నిర్వహించిన గ్రామ పాలనాధికారుల కౌన్సిలింగ్ కు హాజరై మాట్లాడుతూ గ్రామ పాలనాధికారుల కౌన్సిలింగ్ ను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి పారదర్శకంగా నిర్వహించడం జరుగుతున్నదని, ఎలాంటి సిఫారసులకు ,పక్షపాతానికి ఇందులో తావు లేదని అన్నారు. గ్రామ పలనాధికారులుగా ఉత్తర్వులు అందుకున్న వారు సోమవారం నాటికి నూటికి నూరు శాతం విధుల్లో చేరాలని కోరారు. అభ్యర్థులందరి సమక్షంలోనే ఖాళీల జాబితా ప్రదర్శిస్తూ వారి ఐచ్ఛికాల మేరకు పోస్టింగులు కేటాయించడం జరుగుతున్నదని, అందువల్ల గ్రామ పాలన అధికారులు వారి ఐచ్ఛికం మేరకు తీసుకున్న పోస్టులలో చేరి శ్రద్ధ వహించి పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వానికి రెవిన్యూ శాఖపై ప్రత్యేక శ్రద్ధ ఉందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని విధులు నిర్వర్తించాల్సిన బాధ్యత గ్రామ పాలన అధికారులపై ఉందని అన్నారు.

# నన్నూరులో గౌరు జనార్దన్ రెడ్డి జన్మదిన వేడుకలు...

కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు...

**ఓర్వకల్లు సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టిడిపి నందికొట్కూర్ నియోజకవర్గం ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి దంపతుల కుమారుడు పాణ్యం నియోజకవర్గ టిడిపి యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం టిడిపి నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మనోహర్ రెడ్డి, సర్కార్, ఎండి హనీఫ్, శ్రీరాములు,టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల్లో గోలి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు





**ఆమనగల్లు, సెప్టెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నవచైతన్య కాలనీలో బుద్ధినాథ్ వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటిస్తూ శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ సురమల్ల సుభాష్, సైదులు గౌడ్, కమిటీ సభ్యులు చలిచీమల సతీష్, కృష్ణ, శివ, కార్తీక్, రాఘవేందర్, మహేష్, రాకేష్, భరత్, జంగయ్య, బాబు, ప్రవీణ్, గణేష్, జగన్, వినయ్, కృష్ణయ్య, చింటూ, తరుణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.అదే విధంగా, 15వ వార్డు శివాలయం కాలనీలో శివశక్తి యూత్ గణేష్ మండపంలో కూడా గోలి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా తరుణ్ నాయక్, కన్న, ఎంగలి తరుణ్, కుమార్ గౌడ్, గుద్దేటి మహేష్, రాజు, శివ, కోట్ల గౌతం, ఆకాష్, అక్షయ్, కోట్ల వెంకటేష్, ఉమాపతి గౌడ్, సందర్శ గౌడ్, ఎంగలి యాదగిరి, ఎంగలి రఘు, ఎంగలి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# వంగూరులో టీచర్స్ డే వేడుకలు

బెల్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా నిర్వహణ




**వంగూరు, సెప్టెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మండల కేంద్రంలోని బెల్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో సెప్టెంబర్ 6న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్ స్కూల్ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై, ఉపాధ్యాయుల పాత్రపై ప్రసంగించారు. "గురువులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారు. విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దే మార్గదర్శకులు" అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గెల్వయ్య, టీచర్లు విష్ణు, ప్రదీప్, పర్వతాలు, రేణుక, రేష్మ, హస్బి, తనూష, నేహా, మధు, యశోద, అలివేల తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందించి, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలకు మరింత అందం చేకూర్చారు.

# అంతర్జాతీయ చదరంగంలో విశ్వృత్ రామ్ ప్రతిభ

విజయవాడ ఫిడే రేటింగ్ టోర్నీలో రేటింగ్ సాధించిన కరీంనగర్ విద్యార్థి



**కరీంనగర్, సెప్టెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గత నెల 26 నుండి 31వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించిన అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్లో కరీంనగర్‌కు చెందిన అకెనపల్లి విశృత్ రామ్ పాల్గొని ఫిడే రేటింగ్ సాధించి ప్రతిభను చాటాడు.విశృత్ రామ్‌ను జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు కంకటి కనకయ్య, అకాడమీ డైరెక్టర్, సీనియర్ కోచ్ అనూప్ కుమార్, జగన్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కేశెట్టి జగన్, ఉమ్మడి జిల్లా చెస్ డెమోక్రటిక్ సంయుక్త కార్యదర్శులు కంకటి సుజన్ కుమార్, తాటిపల్లి సతీష్ బాబు, భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు అక్కినపల్లి నాగరాజు తదితరులు అభినందించారు.ఈ సందర్భంగా శివజ్యోతి, అభి, రేవిక్, నితిన్, అరుణ్, తరుణ్, శ్రీరిజ్, స్వాతి, చింటూ తదితరులు విశృత్ రామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# జీఎస్టీ తగ్గింపు ప్రజలకు లాభం కాదు: సిపిఐ



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జీఎస్టీ స్లాబుల తగ్గింపు వెనుక ప్రజల సంక్షేమం కాదని, బీహార్ ఎన్నికల ప్రయోజనమే అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆరోపించారు. షాపూర్‌నగర్లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, “ఒక దేశం – ఒక పన్ను” అంటూ మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ నిత్యావసరాల ధరలు పెరగడానికి కారణమైందని, ఇప్పుడు తగ్గింపు చేసి ప్రజలపై ప్రేమ చూపిస్తున్నట్టు చెప్పడం సిగ్గుచేటు అని విమర్శించారు. అలాగే, రేవంత్ రెడ్డి గత ప్రభుత్వంలో భూముల కబ్జాలపై ప్రచారం చేస్తున్నా, చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, కబ్జాదారులు కాంగ్రెస్ నేతలతో తిరుగుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వ్యవహారాలు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే అవకాశం ఉందని, సిఎం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నర్సింహా రెడ్డి, బక్కరి మల్లేష్, శ్రీనివాస్, మహేందర్, భీమేష్, రమేష్, కనకయ్య, మహేష్, మజ్జి గౌరీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో విద్యార్థులకు భవిష్యత్తు




**కరీంనగర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో అర్బన్ ఎస్జీఎఫ్ కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థుల భవిష్యత్తు క్రీడలతో మెరుగవుతుందని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నదని నరేందర్ రెడ్డి తెలిపారు. మానేరు విద్యాసంస్థలు క్రీడారంగ అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రశంసించారు. విద్యతో పాటు క్రీడలకు సముచిత స్థానం కల్పిస్తున్నామని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి తెలిపారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారుఅతిథులతో కాసేపు కబడ్డీ ఆడి సందడి చేసిన నరేందర్ రెడ్డి, పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి. శ్రీనివాస్ గౌడ్, ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణు గోపాల్, తెలంగాణ కబడ్డీ సంఘం ఉపాధ్యక్షులు సీహెచ్ సంపత్ రావు, పెటా టీఎస్ అధ్యక్షులు బాబు శ్రీనివాస్, కార్యదర్శి ఆడేపు శ్రీనివాస్, అర్బన్ ఎస్జీఎఫ్ కార్యదర్శి అంతటి శంకరయ్య, సైక్లింగ్ వుషు క్రీడా సంఘాల అధ్యక్షులు బుర్ర మధుసూదన్ రెడ్డి, బార విద్యాసాగర్, పీఈటీఏ అధ్యక్షులు బత్తిని శ్రీధర్, కార్యదర్శి దారం గౌతం రెడ్డి, పీడీ పీఈటీలు సిలివేరి మహేందర్, కూరపాటి లక్ష్మీనారాయణ, ఆనంద్, శ్రీధర్ రెడ్డి, చిరంజీవి, లింగారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్లలో గణపతి లడ్డూ వేలం

**– 45 వేల రూపాయలకు దక్కించుకున్న అలివేలు దంపతులు**







**ఆరుట్ల, సెప్టెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
శ్రీ మేజర్ పద్మ పాణి ఆచార్య యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన మహా గణపతి నవరాత్రుల పూజలు వైభవంగా కొనసాగాయి. నిమజ్జనానికి శోభాయాత్రగా బయలుదేరే సందర్భంలో లడ్డూ వేలం నిర్వహించగా, అలివేలు & శ్రీనివాస్ గౌడ్ దంపతులు 45 వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. వీరిని బీజేపీ మండల అధ్యక్షులు నూకం రాజు ముదిరాజ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు కొత్తపల్లి శేఖర్ గౌడ్, పూజారి రమేష్ సార్, ఆడెపు శేఖర్, నూకం జగన్, గుడ్డిమల్లి భాస్కర్, కాసులు రమేష్, నూకం జంగయ్య, నూకం రామకృష్ణ, గుడ్డిమల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడు విజయ మార్గదర్శి

**ఎమ్మెల్యే వివేకానంద్**



**నిజాంపేట్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ మధురనగర్ కాలనీ అష్టలక్ష్మి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై గణనాధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “కష్టాలను తొలగిస్తూ మనకు విజయ మార్గం చూపేవాడు వినాయకుడు” అని పేర్కొన్నారు. వినాయక నవరాత్రులు భక్తి, శ్రద్ధ, శాంతి, సమృద్ధికి ప్రతీకగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు రాఘవేంద్ర రావు, రవి కిరణ్, పెద్దిరెడ్డి సుజాత, నాయకులు విష్ణు, సాంబశివా రెడ్డి, స్వామి, ముత్యాలు, దివాకర్ రెడ్డి, జశ్వంత్ రెడ్డి, మేకల మధుసూదన్, సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం

**63 మంది ఉపాధ్యాయులకు సన్మానం**



**వనపర్తి,సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కార్యక్రమం శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.“సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఒక మహోన్నత గ్రంథం లాంటిది. నిరుపేద కుటుంబంలో పుట్టి ఉపాధ్యాయుడిగా మొదలైన ఆయన ప్రయాణం చివరకు దేశ ప్రథమ పౌరుడి స్థాయికి చేరుకోవడం ప్రతి ఉపాధ్యాయుడికి స్ఫూర్తి కావాలి. విద్యార్థులకు మనసుపెట్టి బోధించండి, వనపర్తిని విద్యాపరంగా ఉన్నతస్థాయికి తీసుకెళ్లండి” అని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధ్యాయుల పదోన్నతులు, కొత్త నియామకాలపై కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ “ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది. ఉపాధ్యాయులను దేవునితో సమానంగా భావిస్తారు. విద్యార్థులకు భట్టి విద్య కాకుండా లాజిక్ నేర్పండి. సృజనాత్మకత, నైతిక విలువలతో సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దండి” అని ఉపాధ్యాయులను కోరారు. ఇటీవల రెండు జిల్లాలు రాష్ట్రంలో విద్యాపరంగా అత్యుత్తమంగా గుర్తించబడ్డాయని, అందులో వనపర్తి లేకపోవడం బాధ కలిగించిందని తెలిపారు. రానున్న రోజుల్లో వనపర్తిని చదువులో కూడా ఉత్తమ జిల్లాగా మార్చాలని సూచించారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ “ఉపాధ్యాయులు విద్యార్థులలో జ్ఞానతపస్సు రగిలించాలి. శాస్త్రవేత్తల జీవిత కథలు చెప్పి వారికి స్ఫూర్తి నింపాలి. పోలీసులు, ఉపాధ్యాయులు, యంత్రాంగం కలిసికట్టుగా కృషి చేస్తే విద్యార్థుల భవిష్యత్తు మరింత ప్రకాశవంతమవుతుంది. పోలీస్ శాఖ తరపున విద్యార్థులకు టైక్వాండో, మార్షల్ ఆర్ట్స్ శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నాం” అని తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థులు తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన బోనాల పండుగ వేషధారణలతో చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 63 మందిని ప్రశంసాపత్రం, శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, డీఈఓ మహమ్మద్ గని, ఏసీజీ గణేష్, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వంగూరులో మహా గణపతి నిమజ్జనానికి శోభాయాత్ర

**–అయ్యప్ప కాలనీలో ప్రత్యేక పూజలు, కోలాటాలతో భక్తి శోభ**



**వంగూరు, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల కేంద్రంలోని అయ్యప్ప కాలనీలో మహా గణపతి నిమజ్జన కార్యక్రమం ఈ రోజు జరగనున్న నేపథ్యంలో కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు కోలాటాలు, బతుకమ్మలు నిర్వహించి భక్తి శ్రద్ధలతో గణనాథుని సేవలో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమంలో వినాయక భక్త బృందం సభ్యులు ముకురాల నరేందర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ నర్మదా జనార్ధన్, నకినమోని శేఖర్, వెంకట్ గౌడ్, సురేష్, మల్లేష్ యాదవ్, రవి, నగేష్ గౌడ్, శివ రమేష్ గౌడ్, మధు, సైదులు, జంగయ్య, దశరథం, సూర్య, శ్రీను, గోపాల్, గెలవయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మణికంఠ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.కాలనీవాసులు, యువకులు, వంగూరు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నిమజ్జన శోభాయాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# కరీంనగర్‌లో గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు ఘన ముగింపు

**విహెచ్పీ ఆధ్వర్యంలో స్వాగత వేదిక, శాంతియుతంగా నిమజ్జనం**




**కరీంనగర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కమాన్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విహెచ్పీ స్వాగత వేదిక నుంచి వివిధ గణనాథులకు ఘన స్వాగతం పలికారు. గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సెప్టెంబర్ 5వ తేదీ శుక్రవారం సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమై, సెప్టెంబర్ 6వ తేదీ శనివారం ఉదయం 3:30 గంటల వరకు నిరంతరంగా కొనసాగింది. చివరి గణనాథునికి పూజ, హారతి, శాంతి మంత్రాలతో నిమజ్జన కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా విహెచ్పీ, భజరంగదళ్ నాయకులు, కార్యకర్తలు, పోలీసు, మున్సిపల్ సిబ్బంది చివరి వరకు పాల్గొని శాంతియుతంగా నిమజ్జనం జరిగేలా సహకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జగదీష్ ఆచారి, పిట్ల స్వామి, నమిలికి కొండ రమణాచార్యులు, కలర్ సత్తన్న, ప్రసాద్ యాదవ్, సుడా చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీజేపీ నాయకులు, పోలీసు అధికారులు పాల్గొని గణనాథునికి పూజలు నిర్వహించారు.

# యూరియా సరఫరా పట్ల చర్యలు

**మంత్రి తుమ్మలతో మాట్లాడిన ఎమ్మెల్యే విజయరమణ**



**పెద్దపల్లి, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులకు యూరియా సక్రమంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే, నిల్వలు, పంపిణీ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ప్రతిపక్షాలు అపోహలు సృష్టిస్తున్నా, పిఎసిఎస్‌ల ద్వారా రైతులందరికీ యూరియా అందేలా పక్కా ప్రణాళికతో పనిచేస్తున్నామని తెలిపారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడి, తక్షణ యూరియా సరఫరా కోరగా, మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏడీఏ శ్రీనాథ్, మండల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# సేవా యజ్ఞంలో వాసవి వాగ్దేవి క్లబ్ ముందంజ




**కరీంనగర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్య శిబిరాలు, రక్తదానం, వృద్ధాశ్రమ సేవలు, మహిళా సాధికారత కార్యక్రమాలతో వాసవి వాగ్దేవి క్లబ్ సేవా రంగంలో అగ్రగామిగా నిలుస్తోంది. పాత్రికేయులకు శాలువాలు కప్పి, బహుమతులు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మ అరుణ, రాధా కిషన్, రూప శ్రీ, వజ్జల రాజమణి, గంపహారిణి పాల్గొన్నారు.

# మహానాయకుడి నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఓసి సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి

**కూకట్ పల్లి సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
: వివేకానంద నగర్, ఈనాడు కాలనీలో తొమ్మిది రోజులు పూజలు అందుకున్న లంబోదరున్ని నిమజ్జనం చేయుచున్న సందర్భంగా కృష్ణ మూర్తి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరై అన్నదానం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఓసి సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు ఈ కార్యక్రమంలో లాయర్ ప్రసాద్ ,రవీందర్ రెడ్డి ,రాములు ,జి.యస్.యన్ రాజు ,నాయుడు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను వెంటనే రిపేర్ చేయాలి

**ఆగిపోయిన రోడ్లను తిరిగి ప్రారంభించాలి: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



**మునుగోడు, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నియోజకవర్గంలో అధిక వర్షాల వల్ల దెబ్బతిన రోడ్లని వెంటనే రిపేరు చేయాలని,గుంతల మయంగా మారి ప్రమాదకరంగా మారిన రోడ్లను గుర్తించి త్వరితగతిన వాటిని పూడ్చివేయాలని,వర్షాల వల్ల ఆగిపోయిన రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని అన్నారు మునుగోడు శాసనసభ్యులు సభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో యాదాద్రి నల్గొండ జిల్లాల ఆర్ అండ్ బి,పంచాయతీరాజ్ శాఖ అధికారులు,కాంట్రాక్టర్లతో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు.. రోడ్లు మరియు భవనాల శాఖకు సంబంధించి నియోజకవర్గంలో ఇప్పటికే 700 కోట్ల రూపాయలతో 221 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని,మరో 343 కోట్ల వ్యయంతో 120 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి పనులు మంజూరు దశలో ఉన్నాయని,మరొక 170 కోట్ల వ్యయంతో 4 రోడ్లను HAM రోడ్లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ప్రపోసల్స్ పంపించామని తెలిపారు... పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఇప్పటికే 254 కోట్ల వ్యయంతో 75 రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయని,మరొక 262 కోట్ల వ్యయంతో 58 రోడ్లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ప్రపోజల్స్ పంపించామన్నారు..నియోజకవర్గంలో ఇప్పటివరకు ఆర్ అండ్ బి,పంచాయతీరాజ్ శాఖ కలుపుకొని 1500 కోట్ల రూపాయలతో వివిధ దశల్లో రోడ్ల అభివృద్ధి కి పనులు జరుగుతున్నాయన్నారు.. రాబోయే కాలంలో మరో 1500 కోట్ల రూపాయలు రోడ్లకు నిధులు తీసుకొచ్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వీటితో మునుగోడు నియోజకవర్గంలోని రోడ్డు నెట్వర్క్ రూపురేఖలన్నీ మారిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.. ఈ సమీక్ష సమావేశంలో యాదాద్రి నల్గొండ జిల్లాల అధికారులు,ఏడు మండలాలకు చెందిన ఆర్ అండ్ బి పంచాయతీరాజ్ అధికారులు,రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లు,వివిధ మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కమాన్‌పూర్‌లో పక్కా గ్రంథాలయ భవనానికి కృషి చేస్తా: ఎస్.ఎస్. అన్వర్

**మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో నిర్మాణానికి ప్రయత్నం**



**కమాన్‌పూర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ గ్రంథాలయాన్ని సందర్శించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎస్.ఎస్. అన్వర్ మాట్లాడుతూ, "మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో లిలిపక్కా గ్రంథాలయ భవన నిర్మాణానికి కృషి చేస్తాను" అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకురాలతో మాట్లాడి వాస్తవ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. "గ్రంథాలయాలు ప్రజల విజ్ఞాన వికాసానికి కేంద్ర బిందువులు. శాశ్వత భవనం ద్వారా మరింత సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగు సత్యనారాయణ, ఇనగంటి రామారావు, కిషన్ రెడ్డి, సయ్యద్ ఇక్బాల్, అంబీరు శ్రీనివాస్, అబ్దుల్ రఫీక్, దాసరి గట్టయ్య, ఎండి. ముస్తాక్, శవ శంకర్, మల్యాల మహేష్, నవునూరి నర్సాగౌడ్, జంగపెల్లి రవి, చాట్ల గట్టయ్య, గడ్డం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి: ఎస్.ఎస్. అన్వర్

**కమాన్‌పూర్‌లో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్ర ప్రారంభం**



**కమాన్‌పూర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎస్.ఎస్. అన్వర్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను చిన్నచూపు చూసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత బస్సు ప్రయాణం, ?500కే గ్యాస్ సిలిండర్, వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ నిర్వహణ బాధ్యతలు మహిళలకే అప్పగించడం వంటి పలు సంక్షేమ చర్యలు చేపట్టింది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ స్వరాజ్య సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ధనలక్ష్మి, మండల కోఆర్డినేటర్ కుమ్మరి సవిత, ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, మండల తహసీల్దార్ వాసంతి, ఎంపీడీవో లలిత, కాంగ్రెస్ నాయకులు రంగు సత్యనారాయణ, ఇనగంటి రామారావు, కిషన్ రెడ్డి, అంబీర్ శ్రీనివాస్, సయ్యద్ ఇక్బాల్, ఎండి. ముస్తాక్, అబ్దుల్ రఫీక్, మల్యాల మహేష్, నగునూరి నర్సయ్య, ఇనగంటి ప్రభాకర్ రావు, చాట్ల గట్టయ్య, గఫ్ఫార్ తదితరులు పాల్గొన్నారు.

# పేద, మధ్యతరగతి, ఎంఎస్ఎంఈలకు ఊరట కలిగించే జీఎస్టీ సంస్కరణలు

**-వ్యవసాయ రంగానికి పన్ను భారాన్ని తగ్గించేందుకు కేంద్ర చర్యలు**



**హుజురాబాద్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పేద, మధ్యతరగతి ప్రజలు, చిన్న తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), వ్యవసాయ రంగంపై పన్ను భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ చట్టంలో సంస్కరణలు చేపట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు.భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోట నుంచి జీఎస్టీపై కీలక ప్రకటన చేసినట్లు ఆయన గుర్తు చేశారు. గతంలో ఉన్న 12 శాతం , 28 శాతం శ్లాబులను సరళీకరించి, వాటిలోని 99 శాతం వస్తువులను 5 శాతం శ్లాబ్‌లో, 90 శాతం వస్తువులను 18 శాతం శ్లాబ్‌లోకి మార్చినట్లు వివరించారు.పాన్ మసాలా, పొగాకు, ఆన్‌లైన్ గేమింగ్ వంటి హానికరమైన వస్తువులకు మాత్రమే 40 శాతం పన్ను విధిస్తున్నట్లు తెలిపారు. నిత్యావసర వస్తువులు "శూన్య శాతం" జీఎస్టీలో కొనసాగనున్నాయని, ఆరోగ్య సేవలు, విద్య, ఔషధాలు ఇకపై చౌకగా లభించనున్నాయని పేర్కొన్నారు.ఈ సంస్కరణల వల్ల సామాన్య ప్రజానీకానికి జీవన వ్యయంపై భారం తగ్గి, వినియోగ సామర్థ్యం పెరిగి, దేశీయ మార్కెట్లకు డిమాండ్ పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యాపార రంగానికి, ఉత్పత్తిదారులకు మద్దతు లభించి, దేశ ఆర్థిక స్థిరత్వానికి ఇది దోహదం చేస్తుందని గంగాడి కృష్ణారెడ్డి అన్నారు.

# పర్వత వర్ధిని ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


**-ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేసిన గండ్ర సత్యనారాయణ రావు**



**భూపాలపల్లి, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గణపురం మండలంలోని బుద్దారం గ్రామంలో పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు శనివారం సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి, పంచాయతీ రాజ్ అధికారులు తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సింగరేణి, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.అదే రోజు భూపాలపల్లి కలెక్టరేట్‌లోని ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల వేడుక -2025 గురుపూజోత్సవం ఘనంగా జరిగింది.
ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇతర అధికారులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, "ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి సేవలకు గుర్తింపు ఇవ్వడం గర్వకారణం" అని అన్నారు. ఈ సందర్భంగా మొత్తం 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, మెమెంటోలు అందించి ఘనంగా సన్మానం చేశారు.

# జీఎస్టీపై మోడీ ప్రభుత్వం సంచలన నిర్ణయం

**మూడు అంచెల పన్ను విధానం, వినియోగదారులకు ఊరట**




**కరీంనగర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జీఎస్టీ స్లాబుల్లో సంచలన మార్పులు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం, నిత్యావసర వస్తువులకు 5 శాతం, సాధారణ వస్తువులకు 18శాతం, విలాసవంతమైన, హానికరమైన వస్తువులకు 40 శాతం పన్ను విధానాన్ని అమలు చేస్తోంది.28 శాతం శ్లాబును పూర్తిగా తొలగించి, పాన్ మసాలా, గుట్కా, సిగరెట్లు వంటి వస్తువులకు మాత్రమే 40 శాతం వర్తించనుంది.టీవీలు, ఏసీలు, వాషింగ్ మెషిన్లు వంటి గృహోపకరణాలపై పన్ను 28 శాతం నుంచి 18 శాతంకి తగ్గించడంతో ధరలు తగ్గనున్నాయి.మెడిసిన్స్, బీమా పాలసీలకు జీఎస్టీ మినహాయింపు లభించడం ప్రజలకు ఊరట కలిగిస్తుందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర తెలిపారు.పన్ను తగ్గింపుల వల్ల వినియోగదారుల చేతిలో డబ్బు మిగిలి, దేశీయ మార్కెట్లకు డిమాండ్ పెరుగుతుంది. ఇది దేశ ఆర్థిక స్థిరత్వానికి దోహదం చేస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

# వేములవాడ ఆసుపత్రికి అంబులెన్స్ సమకూర్చిన బండి సంజయ్




**వేములవాడ, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన సొంత నిధులతో వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ వెహికల్ ఇంఛార్జీ సాంబాయిపల్లి శ్రీనివాసరెడ్డి ఆసుపత్రి అధికారులకు అంబులెన్స్‌తో పాటు సంబంధిత పత్రాలు అందించారు.అత్యవసర సేవల కోసం ఈ వాహనం ఎంతో ఉపయోగపడనుందని అధికారులు తెలిపారు. గతంలోనూ బండి సంజయ్ రూ.3 కోట్ల విలువైన వైద్య పరికరాలను ప్రభుత్వ ఆసుపత్రులకు అందించారు. కరోనా సమయంలో రెమిడిసివర్, పీపీఈ కిట్లు, కాన్సట్రేటర్లు, రక్తదానం వంటి సేవలతో వేలాది మందికి ప్రాణాధారం అయ్యారు.త్వరలోనే సీఎస్సార్ కింద రూ.5 కోట్ల విలువైన మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను వేములవాడ సహా పలు ఆసుపత్రులకు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.




**సిరిసిల్లలోని వినాయక నిమజ్జనానికి చేసిన ఏర్పాట్లను పరిశీలించిన బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీ రెడ్డ బోయిన గోపి మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నల తిరుపతి రెడ్డి**

# ఓల్డ్ హైస్కూల్‌ను ఆధునిక సైన్స్ మ్యూజియంగా తీర్చిదిద్దాలి: కలెక్టర్ పమేలా



**కరీంనగర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కేంద్రంలోని పురాతన ఉన్నత పాఠశాల భవనాన్ని పూర్తిగా సైన్స్ మ్యూజియంగా మార్చాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా మినీ ప్లానిటోరియం, డైనోసార్స్, రోబోటిక్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, సెమినార్ హాల్ ఏర్పాటు చేయాలని సూచించారు.పాఠశాల తరగతులను వారం రోజుల్లోగా నూతన భవనంలోకి తరలించాలని, డీసీబీ కార్యాలయం, ఓపెన్ స్కూల్ కేంద్రాన్ని ఇతర భవనాలకు మార్చాలని ఆదేశించారు. సందర్శనలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో చైతన్య జైనీ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అశోక్, సైన్స్ అధికారి జైపాల్ పాల్గొన్నారు.

# వయోవృద్ధుల కేసులు ఆన్‌లైన్‌లో దాఖలుచేయాలి

**టి.ఎస్.సి.ఎం.ఎం.ఎస్. పోర్టల్ వినియోగంపై కలెక్టర్ సూచన**




**మంచిర్యాల, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వయోవృద్ధుల సంరక్షణ, సంక్షేమానికి సంబంధించిన కేసులను ఇకపై తెలంగాణ సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ కేసెస్ మానిటరింగ్ సిస్టమ్ (టి.ఎస్.సి.ఎం.ఎం.ఎస్.) ద్వారా లేదా మీసేవ కేంద్రాల ద్వారా దాఖలు చేయవలసి ఉంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజెన్స్ యాక్ట్-2007, రాష్ట్ర నియమావళి-2011 ప్రకారం ఆఫ్‌లైన్ దాఖలును ప్రభుత్వం నిలిపివేసిందని, పోర్టల్ వినియోగంపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సీనియర్ సిటిజెన్లు తమ హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఈ వేదికను వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# డిజిటల్ లో లింగ భేదం తొలగించాలి

-ఎంపీ కడియం కావ్య
-గోవాలో మహిళల ఆర్థికాభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్




**వరంగల్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గోవా రాష్ట్రంలో ఫ్రిడ్రిక్ ఎబర్ట్ స్టిఫ్టుంజ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ సెమినార్‌లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె డిజిటల్ లింగ భేదం, మహిళల ఆర్థికాభివృద్ధి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విశ్లేషణాత్మకంగా వివరించారు.“చిన్న, మధ్యతరగతి ఆదాయ దేశాల్లో మహిళలు పురుషుల కంటే 8 శాతం తక్కువగా మొబైల్ ఫోన్లు కలిగి ఉన్నారు. స్మార్ట్‌ఫోన్ వినియోగంలో 13 శాతం తేడా ఉంది. 405 మిలియన్ల మంది మహిళలు ఇంకా డిజిటల్ ప్రపంచానికి చేరుకోలేకపోతున్నారు” అని ఎంపీ కావ్య పేర్కొన్నారు. భారతదేశంలో 75 శాతంమహిళలు మొబైల్ ఫోన్, 35 శాతం మాత్రమే స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్నారని, ఈ డిజిటల్ గ్యాప్ వల్ల ఆర్థిక స్వావలంబన, విద్య, ఆరోగ్య సేవలు పొందడంలో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. అలాగే, కాకతీయ రాణి రుద్రమదేవి, సమ్మక్క%-%సారలమ్మ వంటి చారిత్రక సంఘటనల ద్వారా వరంగల్ ప్రాంత మహిళల శక్తిను ఆమె ఉదహరించారు. “ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు 33% రిజర్వేషన్లు, రూ.344 కోట్ల వడ్డీ లేని రుణాలు, ఆరోగ్య బీమా, నెలకు ?2,500 ఆర్థిక సహాయం వంటి పథకాలు అమలవుతున్నాయి” అని ఎంపీ కావ్య వివరించారు. డిజిటల్ లో మహిళల అసమానతలు తగ్గించేందుకు తక్కువ ధరకే మొబైల్ డివైసులు, డిజిటల్ విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి అత్యవసరమని ఆమె సూచించారు. ఈ సెమినార్‌లో తమిళనాడు ఎంపీ ఆర్. సుధ, ఎమ్మెల్యే పర్ణికా రెడ్డితో పాటు పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.


## జీఎస్టీ తగ్గింపుపై బీజేపీ శ్రేణుల హర్షం

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం, కేంద్రానికి ధన్యవాదాలు



**కరీంనగర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జీఎస్టీ పన్ను తగ్గింపుపై కొత్తపల్లి రూరల్ మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో బహుపేట గ్రామంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కుంట తిరుపతి మాట్లాడుతూ, “పేద, రైతు, మధ్యతరగతి ప్రజలకు కేంద్రం ఊరట కలిగించింది. నిత్యావసరాలు, విద్య, ఆరోగ్య సేవలు అన్ని చౌకగా లభించనున్నాయి” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జవ్వాజి రమేష్, కడార్ల రతన్ కుమార్, వేముల అనిల్ కుమార్, సోమినేని కర్ణాకర్, నలవాల మహేష్, మెరుగు మల్లేశం, ఇల్లెందుల ఆనంద్, కట్ల శ్రీనివాస్, కట్ల వెంకటేష్, నేరెళ్ల గంగారం, మల్లం రాచకొండ అనిల్, దావ సందీప్, ఓరుగంటి శ్రీనివాస్, చాట్లపేల్లి కుమారస్వామి, చొప్ప మహేష్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సభ్యులను ఓపెన్ స్కూల్‌లో చేర్పించాలి



**కరీంనగర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో విఫలమైన స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులను తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో చేర్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు.రిజిస్ట్రేషన్ గడువు ముగిసేలోగా చర్యలు తీసుకోండి శనివారం కలెక్టరేట్లో మెప్మా, డీఆర్డీఓ అధికారులు, సిబ్బందితో కలిసి ఉల్లాస్ కార్యక్రమం మరియు ఓపెన్ స్కూల్ రిజిస్ట్రేషన్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మీ సేవ ద్వారా అర్హత కలిగిన ప్రతి సభ్యురాలిని ఆదివారం సాయంత్రం లోగా రిజిస్ట్రేషన్ చేసి ఓపెన్ స్కూల్‌లో చేర్పించాలని స్పష్టం చేశారు. అక్షర జ్ఞానం కలిగిన సమాజం వైపు అడుగులు ప్రతి మహిళకు అక్షర జ్ఞానం కలిగేలా ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ శ్రీధర్, మెప్మా పీడీ సరూప రాణి, డిపిఎమ్‌లు, సీఓలు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం




**హుస్నాబాద్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం అట్టహాసంగా జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కోఆర్డినేటర్ ఎం. బాలయ్య ముఖ్య అతిథిగా, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. ఈశ్వర్, రాష్ట్ర కార్యదర్శి లింగాల యాదగిరి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎం. బాలయ్య మాట్లాడుతూ రాబోయే పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో బీసీ, ముస్లిం, ఎస్సీ, ఎస్టీ వర్గాలను చైతన్యపరిచి బహుజన వాదాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత 60 ఏళ్లుగా అగ్రవర్ణాలు రాష్ట్రాలను ఏలుతున్నాయని, బలహీనవర్గాల ఐక్యతతోనే సమాన హక్కులు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఓం ప్రకాష్, హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, జిల్లా ఇన్చార్జిలు, అసెంబ్లీ ఇన్చార్జులు, అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం సిద్దిపేట పట్టణం నడిబొడ్డున ర్యాలీ నిర్వహించి బహుజన ఐక్యతకు నినాదాలు చేశారు.


## ప్రశాంతి నగర్‌లో సబ్ రేషన్ షాప్ ప్రారంభం

వినాయక నిమజ్జనంలో గల్లంతైన యువకుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**రామగుండం, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్థానిక 5వ డివిజన్ ప్రశాంతి నగర్‌లో నూతన సబ్ రేషన్ షాప్‌ను ప్రారంభించారు. “కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమానికి కట్టుబడి ఉంది. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాలు నేరుగా చేరేలా చర్యలు తీసుకుంటాం” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అదే రోజు గోదావరిఖనిలో వినాయక నిమజ్జనంలో గల్లంతైన యువకుడు రాజు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. “ఆచూకీ కోసం గజ ఈతగాళ్లతో గాలింపు కొనసాగుతోంది. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటాం” అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, పోలీసు, మున్సిపల్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ నాయకుడు మోహన్ రావు పుట్టినరోజు వేడుకలు.



**ఎలిగేడు, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారులు బిఆర్ఎస్ నాయకులు తానిపర్తి మోహన్ రావుపుట్టినరోజు వేడుకలను బిఆర్ఎస్ యూత్ నాయకులు కవ్వంపల్లి సాయినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్య పరచిన నాయకుడు రాబోయే రోజుల్లో మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో ఉండాలని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కవ్వంపల్లి సతీష్, కాశిపాక రవి (సచిన్), కవ్వంపల్లి రాకేష్,, రాజేశం ,నగేష్ మధు తదితరులు ఉన్నారు.

## హుజూరాబాద్‌లో బంగారు గొలుసు దొంగతనాల కేసు ఛేదించిన పోలీసులు




**హుజూరాబాద్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జల్సాలు, పేకాట వ్యసనాలకు బానిసైన యువకుడు పలు చోట్ల దొంగతనాలకు పాల్పడి వృద్ధుల వద్ద నుండి బంగారు గొలుసులను అపహరించిన కేసును హుజూరాబాద్ పోలీసులు ఛేదించారు. నిందితుడి వద్ద నుండి దాదాపు రూ. 9 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.హుజూరాబాద్ ఏసీపీ మాధవి తెలిపిన వివరాల ప్రకారం, జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, వీణవంక ఎస్సై అవుల తిరుపతి, సిబ్బంది మోహన్, కోమల్, ప్రశాంత్, రమేష్, మహేష్‌లు చల్లూరి శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, కోర్కల్ గ్రామానికి చెందిన కొలిపాక రవి (37) అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో రవి అనేక దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అతను ఒంటరిగా నివసించే వృద్ధులను లక్ష్యంగా చేసుకుని రాత్రి వేళల్లో వారి మెడలోని బంగారు గొలుసులను దొంగిలించేవాడు. దొంగిలించిన బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి, ఆ డబ్బుతో మహారాష్ట్రలోని గడ్చందుర్‌లో పేకాట ఆడేవాడు. తిరిగి ఆ డబ్బును జల్సాలకు ఖర్చు చేసేవాడని పోలీసులు తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులను ఏసీపీ మాధవి ప్రత్యేకంగా అభినందించారు.

## యూరియా కోసం రైతుల మధ్య ఘర్షణ

వెన్నంపల్లి సహకార సంఘం వద్ద ఉద్రిక్తత

**హుస్నాబాద్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సైదాపూర్ మండలం వెన్నంపల్లి సహకార సంఘానికి యూరియా బస్తాలు వచ్చినట్లు సమాచారం అందడంతో ఎగ్లాస్పూర్, వెన్నంపల్లి గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో చేరారు. పంపిణీ విషయంలో వాగ్వాదం తీవ్రంగా మారి, రెండు గ్రామాల రైతులు పరస్పరం ఘర్షణకు దిగారు.యూరియా కొరత కారణంగా ఉద్రిక్తత నెలకొని, సంఘం వద్ద గందరగోళ వాతావరణం ఏర్పడింది. స్థానిక అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## కవి కొత్త అనిల్ కుమార్‌కు కాళోజీ సాహిత్య పురస్కారం



**కరీంనగర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హైదరాబాద్‌కు చెందిన త్రివర్ణ ఫౌండేషన్ ప్రతి ఏటా అందజేసే సాహిత్య పురస్కారాల్లో భాగంగా ఈసారి కాళోజీ నారాయణరావు పేరిట ఇచ్చే పురస్కారానికి కరీంనగర్‌కు చెందిన కవి, రచయిత కొత్త అనిల్ కుమార్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఫౌండేషన్ కన్వీనర్, జానపద అకాడమీ, అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇప్పటివరకు మూడు కవితా సంపుటాలు రచించిన అనిల్ కుమార్ ప్రస్తుతం సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడిగా సాహితీ సేవలు అందిస్తున్నారు. ఆయనకు ఈ పురస్కారం రావడం పట్ల నంది శ్రీనివాస్, గాజుల రవీందర్, దొమ్మటి శంకర్, కాందూరి వేంకటేశ్వర్లు, సాయిల్ల శ్రీనివాస్, సజ్జన కమలాకర్, శ్రీనివాస చారి, ఏ. శ్రీనివాస్ తదితర కవులు, కళాకారులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## గణేష్ శోభాయాత్రలో ఎంపీ ఈటల రాజేందర్

చార్మినార్ వద్ద అమ్మవారి దర్శనం, లడ్డూ గెలుచుకున్న దశరథ్ గౌడ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని, భాగ్యనగర్ గణేష్ శోభాయాత్రలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. “46 ఏళ్లుగా కొనసాగుతున్న గణేష్ ఉత్సవం, కోట్లాది భక్తుల ఐక్యతకు ప్రతీక” అని ఆయన పేర్కొన్నారు.బాలాపూర్ లడ్డూ వేలం పాటలో లింగాల దశరథ్ గౌడ్ విజయం సాధించగా, ఈటల తలపై లడ్డూను ఉంచి అభిమానం చాటారు. ఈటల రాజేందర్ దశరథ్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

### ఎమ్మెల్యే డా సంజయ్ ని మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కౌన్సిల్ మెంబర్

**జగిత్యాల జిల్లా సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఎడమ కాలు ఫ్రాక్చర్ కాగా జగిత్యాలలో వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పరామర్శించడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కౌన్సిల్ మెంబర్ సంజయ్ రెడ్డి తెలిపారు.

# హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన ఆమనగల్లు బార్ అసోసియేషన్






**ఆమనగల్లు, సెప్టెంబర్ 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహేశ్వరంలో సబ్ కోర్టు ప్రారంభ కార్యక్రమానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తులు అభినందన్ కుమార్ షావలి, విజయ్ సేన్ రెడ్డిలను శనివారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా జడ్జి కరుణ కుమార్ సమక్షంలో, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమనగల్లు కోర్టులో నెలకొన్న సమస్యలను న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అనువైన భవన నిర్మాణం, ఆమనగల్లులో సబ్ కోర్టు ఏర్పాటు, షాద్నగర్ పరిధిలో ఉన్న కేసులను మహేశ్వరం కోర్టుకు బదిలీ చేయాలన్న అంశాలపై విజ్ఞప్తి చేశారు. న్యాయమూర్తులు సానుకూలంగా స్పందించినట్లు యాదిలాల్ తెలిపారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జగన్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి కృష్ణ, సభ్యులు గణేష్, జగన్ గౌడ్, మల్లేష్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## కరీంనగర్‌లో మిత్ర యూత్ గణేష్ నిమజ్జనానికి అడ్డంకులు తొలగింపు



**కరీంనగర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మిత్ర యూత్ క్లబ్ ఏర్పాటు చేసిన భారీ గణేష్ విగ్రహం నిమజ్జన శోభయాత్రకు విద్యుత్ తీగలు, సీసీ కెమెరాల పోల్స్ అడ్డంకిగా మారాయి. ఈ కారణంగా నిన్న రాత్రి నుంచి శోభయాత్ర నిలిచిపోయింది. శనివారం ఉదయం మండప నిర్వాహకులు అక్షయ్, మాజీ కార్పొరేటర్ కుమారుడు నాగసముద్రం ప్రవీణ్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు సమాచారం అందించారు.వెంటనే స్పందించిన మాజీ మేయర్ సునీల్ రావు అక్కడికి చేరుకుని విద్యుత్ తీగలు, కెమెరా పోల్స్ సమస్యను పరిశీలించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ, నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి సంబంధిత శాఖల సహకారంతో అడ్డంకులను తొలగించారు. దీంతో నిమజ్జన శోభయాత్రకు మార్గం సుగమమైంది.అనంతరం పోలీస్ శాఖతో సమన్వయం చేసి శోభయాత్రకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వినాయక విగ్రహాన్ని శోభయాత్రతో నిమజ్జనానికి తరలించడంతో మిత్ర యూత్ క్లబ్ నిర్వాహకులు, స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మాజీ మేయర్ సునీల్ రావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగసముద్రం ప్రవీణ్, మిత్ర యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ నేతల ఆవేదన



**హుస్నాబాద్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగారం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ ప్రజల సమస్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తమైంది. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ప్రజలకు ఇచ్చిన అభివృద్ధి హామీలు అమలవుతున్నాయా అనే ప్రశ్నలు వినిపించాయి. బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ, "ఎన్నికల్లో ఇచ్చిన మాటలను మర్చిపోయినట్లు మంత్రి ప్రవర్తన కనిపిస్తోంది. రైతులు యూరియా కోసం నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. శంకుస్థాపనలే జరిగాయి కానీ పనులు ప్రారంభం కాలేదు. గౌరవెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. ఇసుక ధరలు పెరిగి పేద ప్రజలు ఇల్లు కట్టలేని పరిస్థితి ఏర్పడింది" అని విమర్శించారు.మంత్రి పదవిలో ఉన్నా హుస్నాబాద్ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని, వారికోసం రాత్రి పగలు పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు భూక్యా రాజు నాయక్, జెరిపోతుల లక్ష్మణ్, గడ్డి రవీందర్ పాల్గొన్నారు. ప్రజా సమస్యలపై స్పందించి పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు.

# మరో 20 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగుతుంది

**– ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
"రాష్ట్రంలో మరో 20 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగుతుంది. ప్రతి కార్యకర్త సోషల్ మీడియా వారియర్‌గా మారి పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజలకు చేరవేయాలి. వనపర్తిని రాష్ట్రంలో టాప్-10 నియోజకవర్గాల్లో నిలబెట్టడం మనందరి బాధ్యత" అని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. "పాత, కొత్త అనే తేడా లేకుండా అందరూ 'జై కాంగ్రెస్' నినాదంతో ముందుకు సాగాలి. అభివృద్ధి కోసం ఐక్యత అవసరం" అని పిలుపునిచ్చారు.వనపర్తి నియోజకవర్గంలో విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో సమగ్ర అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. 6 సింగిల్ విండోలు, 2 వ్యవసాయ మార్కెట్ యార్డులు, కేంద్రీయ విద్యాలయం, నవోదయ, వెటర్నరీ కళాశాల, 7 వెటర్నరీ ఆసుపత్రులు, స్పోర్ట్స్ స్కూల్, టర్ఫ్ హాకీ మైదానం, స్విమ్మింగ్ పూల్, జిమ్నేసియం, పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణ, హాం ప్రాజెక్ట్ ద్వారా రహదారుల బలోపేతం త్వరలో అమలులోకి రానున్నాయని వివరించారు.20 నెలల్లోనే రూ.1759 కోట్ల అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, గత పదేళ్ల పాలనలో జీవోలకే పరిమితమైన నిధులు మేము నేరుగా అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని, వనపర్తి అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడూ కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి, పీసీసీ సభ్యులు శంకర ప్రసాద్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, విజయవర్ధన్ రెడ్డి, మండల, బ్లాక్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభినందన సభకు హాజరైన ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్



**రైల్వేకోడూరు సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మరియు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు లకు ముక్క వారి పల్లి వద్ద ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద రైల్వేకోడూరు నియోజకవర్గ జనసేన పార్టీ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితోపాటు రాజంపేటలో ఏర్పాటుచేసిన అభినందన సభ కార్యక్రమానికి అతిథిగా హాజరడం జరిగింది. ఈ సందర్భంగా అరవ శ్రీధర్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్ నాయుడు నియమింపబడడం చాలా ఆనందకరమైన విషయమని ఆయన నాయకత్వంలో బిజెపి అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని భావిస్తూ ప్రజల అండదండలతో ఆయన మరింత ముందుకు కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని ఆయన తెలిపారు.


## జీఎస్టీ తగ్గింపుపై మోదీ చిత్రానికి పాలాభిషేకం



**హుస్నాబాద్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జీఎస్టీ పన్నుల తగ్గింపును దసరా -దీపావళి కానుకగా అభివర్ణిస్తూ బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రానికి పాలాభిషేకం చేశారు.నిత్యావసరాలు, వ్యవసాయ పరికరాలు, ఆరోగ్య భీమా, విద్యా వస్తువులపై పన్ను తగ్గింపుతో సామాన్యులకు ఉపశమనం కలిగిందని పేర్కొన్నారు. ఇకపై జీఎస్టీ రెండు స్లాబ్లుగా 5 శాతం, 18 శాతం మాత్రమే ఉండనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వేల్పుల నాగార్జున్, బోడిగే వెంకటేష్, గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేందర్ చారీ, వడ్డెపల్లి లక్ష్మయ్య, బొప్పిశెట్టి సాయిరామ్, బుర్ర రాజు, బొనగిరి రవి, తోట సమ్మయ్య, లకవత్ శారద, బొనగిరి రాజేష్, చిలుపూరి రాజేష్, సూగుర్తి నాగేశ్వర్ చారీ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్లలో చండీశ్వర్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

## పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు





**మంచాల, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆరుట్ల గ్రామంలో చండీశ్వర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, గణపతి ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచాల సీఐ మధు, ఎస్సై నాగేశ్వర రావు, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చీరాల రమేష్, మార్కెట్ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, నాయకులు రావుల భాషయ్య, గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, రాజు గౌడ్, మార బుగ్గరాములు, పున్నం రాము, చిందం జంగయ్య, మొగ్రి ఐలయ్య, చండీశ్వర్ యూత్ అధ్యక్షులు చెరుకు శేఖర్, యూత్ సభ్యులు, కులపెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైభవో పేతంగా గణనాథుడి నిమజ్జనం






**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని 129 వ డివిజన్ సంజీవ్ గాంధీ నగర్ లో . శ్రీ సిద్ధి వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ ఉత్సవాలు అంచలంచలుగా ఎంతో భక్తిశ్రద్ధలతో నిత్యం పూజలు అందుకుంటున్న గణేష్ కి ఎంతో ఘనంగా వీడ్కోలు పలకుతూ శోబాయమానంగా ప్రతిరోజు పూజలు అర్చనలు లక్ష్మీ కుంకుమార్చనలు గణపతి హోమాలు వైభవంగాసుబ్రహ్మణ్యస్వామి అభిషేకం,, ఆంజనేయ స్వామి పూజ జరుపుకున్నారు ఆదివారం ఘనంగా అన్నప్రసాదం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానికులు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు మందాటి నవీన్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఆదిత్య, సంతోష్ రెడ్డి, రణధీర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, నారాయణరెడ్డి, రమేష్, సునీల్, వినయ్ వర్ధన్,తదితరులు పాల్గొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూరారం సిఐ సురేష్ కృష్ణ, సిపిఐ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలకని లక్ష్మణ్ , స్థానిక కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తి వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని చూసి స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా లడ్డం వేలం పాట లో జి వి స్ భరత్వేలంపాటలో 160000లకు దక్కిచ్చుకున్నారు, అతను మాట్లాడుతూ ,తనకు ఎంతో సంతోషం గా ఉంది అని హర్షం వెక్తం చేశారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో భారీగా విరిగిపడ్డ కొండచరియలు



**జమ్మూకశ్మీర్ సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్న విషయం తెలిసిందే. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుంభవృష్టికి జనజీవనం అస్తవ్యస్థమైంది. ముఖ్యంగా జమ్మూకశ్మీర్ సహా హిమాచల్ ప్రదేశ్ , ఉత్తరాఖండ్ రాష్ట్రాలను వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. భారీ వర్షాలకు ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. అనేక చోట్ల భారీగా కొండచరియలు విరిగిపడుతున్నాయి.తాజాగా హిమాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. సిమ్లా జిల్లాలోని రాంపూర్ సబ్‌డివిజన్‌లోని జూరి సమీపంలో బండరాళ్లు రోడ్డుపై పడ్డాయి. దీంతో ఆ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. మరోవైపు గాంచ్వా ప్రాంతంలోనూ కొండచరియలు విరిగిపడటంతో చెట్లు, రోడ్లు దెబ్బతిన్నాయి. సిర్మౌర్ జిల్లా నౌహ్రాధార్ సమీపంలోనూ చౌకర్ గ్రామంలో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. సుమారు 200 మీటర్ల కొండభాగం కూలిపోయింది. అదృష్టవశాత్తూ ఆయా ప్రమాదాల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షాకింగ్ దృష్యాలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.


# హిమాచల్ ప్రదేశ్‌లో భారీగా విరిగిపడ్డ కొండచరియలు






**జమ్మూకశ్మీర్ సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్న విషయం తెలిసిందే. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుంభవృష్టికి జనజీవనం అస్తవ్యస్థమైంది. ముఖ్యంగా జమ్మూకశ్మీర్ సహా హిమాచల్ ప్రదేశ్ ఉత్తరాఖండ్ రాష్ట్రాలను వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. భారీ వర్షాలకు ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. అనేక చోట్ల భారీగా కొండచరియలు విరిగిపడుతున్నాయి.తాజాగా హిమాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. సిమ్లా జిల్లాలోని రాంపూర్ సబ్‌డివిజన్‌లోని జూరి సమీపంలో బండరాళ్లు రోడ్డుపై పడ్డాయి. దీంతో ఆ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. మరోవైపు గాంచ్వా ప్రాంతంలోనూ కొండచరియలు విరిగిపడటంతో చెట్లు, రోడ్లు దెబ్బతిన్నాయి. సిర్మౌర్ జిల్లా నౌహ్రాధార్ సమీపంలోనూ చౌకర్ గ్రామంలో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. సుమారు 200 మీటర్ల కొండభాగం కూలిపోయింది. అదృష్టవశాత్తూ ఆయా ప్రమాదాల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షాకింగ్ దృష్యాలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.


# సెప్టెంబర్ 8న మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడి పిలుపు



**హుస్నాబాద్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపు మేరకు, సెప్టెంబర్ 8న హుస్నాబాద్ ఎమ్మెల్యే మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్చార్జ్ ఆరె కిశోర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో 7 మండలాల బాధ్యులు పాల్గొన్నారు.జీవో నెంబర్ 99, రోస్టర్ పాయింట్ తగ్గింపు వంటి అంశాల్లో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, అసెంబ్లీలో మాల ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయం ముందు జీవో 99 ప్రతులను దగ్ధం చేయాలని, ప్రభుత్వం మొండి వైఖరిని మార్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జోడుముంతల వెంకటస్వామి, జాల శ్రీనివాస్, గంగాధర్, బోలుమల్ల రాజమౌళి, దుంద్ర సుమన్, పాక శ్రీనివాస్, గిరిమల్ల యాదగిరి, గడ్డం రమేష్, కామాద్రి మురళి తదితరులు పాల్గొన్నారు.

# కవితకు మద్దతు ప్రకటించిన గుంజపడుగు హరిప్రసాద్



**కరీంనగర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కలవగా, బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా గ్రామ స్థాయిలో ప్రజా జాగరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లాను ఉద్యమానికి ఆయువు పట్టు చేయాలని, బీసీ మేధావులు, సంఘాలు కలసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సూచించారు. కవిత తీసుకునే ప్రతి నిర్ణయానికి తమ మద్దతు ఉంటుందని హరిప్రసాద్ స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగాలి: కలెక్టర్ పమేలా




**కరీంనగర్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి స్వాగత్ ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకుంటూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, నైతిక విలువలు బోధించాలని, మత్తు పదార్థాల ప్రభావం నుంచి రక్షించాలని సూచించారు.ప్రైవేటు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్‌లో అన్ని పాఠశాలలు పాల్గొనాలని సూచించారు. డీఈఓ చైతన్య జైనీ నాణ్యమైన విద్యపై దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను ప్రశంస పత్రాలతో సత్కరించారు.

# గణనాధుని ఆశీస్సులు పొందిన టిడిపి నాయకులు పాటురి శ్రీనివాసులురెడ్డి



**చిట్వేల్, సెప్టెంబర్ 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని చిట్వేల్ మండలం కె ఎస్ అగ్రహారం లో శనివారం నాడు వినాయకుని నిమజ్జనం పురస్కరించుకొని టిడిపి నాయకులు మరియు క్లాస్ వన్ కాంట్రాక్టర్ పాటూరీ శ్రీనివాసులు రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందడం జరిగింది. నిమజ్జనం సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎస్ అగ్రహారంలో గణనాధుని నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడం చాలా ఆనందదాయకంగా ఉందని విఘ్నాలు తొలగించే గణనాథుడికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి ఆయన ఆశీస్సులు పొందడం నాకు దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తూ గణనాధుని ఆశీస్సులు ప్రజలపై మెండుగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వర్లు, కరుణాకర్ రెడ్డి, షేక్ కరిముల్లా మరియు గ్రామస్తులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.